
ఆంధ్రజ్యోతి

గరిష్ఠం 30.0
కనిష్ఠం 23.6



ANDHRAJYOTHY

నల్లగొండ

7

శుక్రవారం 11 అక్టోబరు 2024





నల్లగొండ వల్లభరావుచెరువులో బతుకమ్మలను నిమజ్జనం చేస్తున్న మహిళలు, ప్రత్యేక అలంకారంలో అమ్మవారు

- ఘనంగా సద్దుల బతుకమ్మ వేడుకలు
- నేడు దుర్గాష్టమి
- ప్రత్యేక పూజలకు ఆలయాల్లో ఏర్పాట్లు

నల్లగొండ కల్చరల్, అక్టోబరు 10: 'గౌరమ్మ.. గౌరమ్మ ఉయ్యాలో.. మాలక్ష్మి గౌరమ్మ ఉయ్యాలో..' అంటూ బతుకమ్మ ఉత్సవాల్లో చివరి రోజు గురువారం సద్దుల బతుకమ్మ వేడుకలను మహిళలు జిల్లా వ్యాప్తంగా ఘనంగా నిర్వహించారు. సాయంత్రం చిరుజల్లులతో కూడిన వర్షం కురిసి వాతావరణం ఒక్కసారిగా చల్లబడటంతో సద్దుల బతుకమ్మ ఉత్సవాలు కొంత ఆలస్యంగా మొదలయ్యాయి. అయినా మహిళలు చిన్నా పెద్ద తేడా లేకుండా తెలంగాణ సంస్కృతిని ప్రతిబింబించేలా తీరొక్క పూలతో అందంగా పేర్చిన బతుకమ్మలను ఒక దగ్గరికి చేర్చి గౌరమ్మను కొలుస్తూ ఆడిపాడారు. అనంతరం బతుకమ్మలను నిమజ్జనం చేసి చల్లంగ చూడాలని ప్రార్థించి గౌరమ్మకు ఘనంగా వీడ్కోలు పలికారు. ఉత్సవాల సందర్భంగా అధికారులు పట్టణాల్లో ప్రత్యేక వేదికలు ఏర్పాటు చేయగా, ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా పోలీసులు బందోబస్తు నిర్వహించారు. అదేవిధంగా శుక్రవారం దుర్గాష్టమి, శనివారం విజయదశమి ఉండటంతో ఈ వేడుకలకు ఆలయాల్లో నిర్వాహకులు ఇప్పటికే ఏర్పాట్లు పూర్తి చేశారు. దుర్గాష్టమి, విజయదశమి సందర్భంగా ఆలయాల్లో ప్రత్యేక పూజలు నిర్వహించనున్నారు. జమ్మిచెట్టును, పాలపిట్టను ప్రత్యేకంగా ఆలయాల్లో ఏర్పాటు చేశారు. ఆలయాలను మామిడాకులు, బంతిపూలు, రంగు రంగుల విద్యుత్ దీపాలతో అలంకరించారు. ఇప్పటికే ఇతర ప్రాంతాలకు ఉపాధి నిమిత్తం వలస వెళ్లినవారు పిల్లాపాపలతో స్వగ్రామాలకు చేరుకున్నారు. దీంతో గ్రామాల్లో సందడి నెలకొంది.

మార్కెట్‌లో దసరా సందడి

దసరా పండుగ సందర్భంగా మార్కెట్ కళకళలాడుతోంది. రెండు రోజులుగా జిల్లాలోని అన్ని వ్యాపార కూడళ్లు బిజీగా మారాయి. వినియోగదారులను ఆకట్టుకునేందుకు దుకాణాల యజమానులు డిస్కౌంట్ ఆఫర్లు ప్రకటించారు. వస్త్ర దుకాణాలు, లేడీస్ ఎంపోరియం, కిరాణ, టపాకాయల దుకాణాలు సరికొత్త స్టాక్‌తో దర్శనమిస్తున్నాయి. వ్యాపారులు పోటాపోటీగా డిస్కౌంట్ ఇస్తుండటంతో మహిళలు, యువతీ, యువకులు వస్త్ర కొనుగోళ్లకు పోటీపడుతున్నారు. దీంతో దుకాణాలు కళకళలాడుతున్నాయి. దసరాకు కొత్త దుస్తులతోఆపాటు పిండి వంటలకు ఎక్కువ ప్రాధాన్యం ఉంటుంది. దీంతో కిరాణ దుకాణాలు బిజీగా మారాయి. కిరాణ దుకాణదారులు సైతం ప్రతీ ఐదు కిలోల కొనుగోళ్లపై డిస్కౌంట్ ఇస్తున్నాయి. అదేవిధంగా పండుగకు పిల్లలు టపాకాయలు అధికంగా కాలుస్తుంటారు. దీంతో జిల్లా వ్యాప్తంగా ప్రత్యేకంగా టపాకాయల రిటైల్, హోల్‌సేల్ దుకాణాలు వెలిశాయి. మొత్తంగా కొనుగోళ్లతో మార్కెట్లలో సందడి ఏర్పడింది.



తాగునీటి ఎద్దడికి చెక్

- ఉమ్మడి జిల్లాలోని 17 మునిసిపాలిటీలకు రూ.461కోట్లు మంజూరు
- వచ్చే 30 ఏళ్ల జనాభా అంచనాతో పనులు

మునిసిపాలిటీల్లో పెరుగుతున్న జనాభాకు అనుగుణంగా నీటి ఎద్దడి ఏర్పడకుండా ఉండేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకుంటోంది. అందులో భాగంగా వచ్చే 30 ఏళ్ల జనాభాను దృష్టిలో ఉంచుకొని ఉమ్మడి జిల్లాలోని 17 మునిసిపాలిటీలకు ప్రభుత్వం అమృత్-2.0 పథకం కింద రూ.461కోట్లు మంజూరు చేసింది. రెండేళ్లలో ఈ పనులు పూర్తిచేసేలా కాంట్రాక్ట్ సంస్థతో ప్రభుత్వం ఒప్పందం చేసుకుంది. దీంతో భవిష్యత్‌లో మునిసిపాలిటీల్లో ఎద్దడి లేకుండా పురవాసులకు సురక్షిత నీరు అందనుంది. •9లో..

ఉపాధ్యాయ ఎమ్మెల్సీ అభ్యర్థిగా నర్సిరెడ్డి

యూటీఎఫ్ రాష్ట్ర అధ్యక్ష, కార్యదర్శులు జంగయ్య, చావా రవి

అధికారికంగా ప్రకటన



సంఘం సమావేశం సందర్భంగా అమరులకు నివాళులర్పిస్తున్న యూటీఎఫ్ నాయకులు

నల్లగొండ టౌన్, అక్టోబరు 10: వరంగల్-ఖమ్మం-నల్లగొండ ఉపాధ్యాయ నియోజకవర్గానికి వచ్చే ఏడాది మార్చిలో జరగనున్న ఎమ్మెల్సీ ఎన్నికల్లో ఐక్య ఉపాధ్యాయ ఫెడరేషన్ (యూటీఎఫ్) అభ్యర్థిగా అలుగుబెల్లి నర్సిరెడ్డిని మరో సారి నిలపాలని రాష్ట్ర కమిటీ నిర్ణయించిందని సంఘం రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శి జంగయ్య, చావా రవి తెలిపారు. గురువారం జిల్లా కార్యాలయంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. ఐదున్నరేళ్లుగా శాసనమండలి సభ్యుడిగా అలుగుబెల్లి నర్సిరెడ్డి విద్యారంగ అభివృద్ధికి, ఉపాధ్యాయుల సంక్షేమానికి కృషి చేశారన్నారు. వివిధ యాజమాన్యాల ఉపాధ్యాయులు, అధ్యాపకుల సమస్యలతో పాటు వివిధ వర్గాల ప్రజాసమస్యలను కౌన్సిల్‌లో ప్రస్తావించి పరిష్కారానికి చొరవ చూపారన్నారు. ఆయన సేవలకు గుర్తింపుగా మరో మారు శాసనమండలి అభ్యర్థిగా అవకాశం ఇవ్వాలని రాష్ట్ర కమిటీ నిర్ణయించినట్టు తెలిపారు. అనంతరం ఎమ్మెల్సీ అలుగుబెల్లి నర్సిరెడ్డి మాట్లాడుతూ, గత ఎమ్మెల్సీ ఎన్నికల్లో ఉపాధ్యాయ, అధ్యాపక మిత్రులకు ఇచ్చిన హామీ మేరకు నిరంతరం ప్రభుత్వ విద్యను కాపాడేందుకు తన వంతుగా కృషిచేశానని అన్నారు. ఉమ్మడి జిల్లా ప్రభుత్వ జూనియర్ కళాశాలల జూనియర్ లెక్చరర్స్ సంఘం, పాలిటెక్నిక్ కళాశాలల అధ్యాపక సంఘం, మోడల్ స్కూల్ సంఘంతో పాటు ఐదు రకాలు గురుకుల ఉపాధ్యాయ సంఘాలు, మైనార్టీ వెల్ఫేర్, ట్రైబల్ వెల్ఫేర్, బీసీ వేల్ఫేర్, ఎస్సీ వెల్ఫేర్, జనరల్ సొసైటీ, తెలంగాణ ఆల్ యూనివర్సిటీస్ కాంట్రాక్ట్ టీచర్స్ అసోసియేషన్ తనకు మద్దతు ప్రకటించాయని తెలిపారు. సమావేశంలో సంఘం నాయకులు రాములు, ఈ.నాగమణి, రాజశేఖర్‌రెడ్డి, డాక్టర్ శ్రీధర్‌కుమార్, కొండయ్య, రాంబాబు, తదితరులు పాల్గొన్నారు.

ఎన్‌సీసీ కేడెట్లకే సైనిక శిక్షణ : లక్ష్మారెడ్డి



బహుమతి సాధించిన విద్యార్థులతో లక్ష్మారెడ్డి

నల్లగొండ, అక్టోబరు 10: విద్యాభ్యాసంలో ఇతర విద్యార్థులకు లభించని ప్రత్యేక సైనిక శిక్షణ ఒక్క ఎన్‌సీసీ కేడెట్లకు మాత్రమే లభిస్తుందని 31వ బెటాలియన్ ఎన్‌సీసీ కమాండింగ్ ఆఫీసర్ కల్నల్ టీఎం లక్ష్మారెడ్డి అన్నారు. గురువారం జిల్లాకేంద్రంలోని ఓ పాఠశాలలో గత 10రోజులుగా శిక్షణ పొందుతున్న విద్యార్థులనుద్దేశించి ఆయన మాట్లాడారు. ఈ శిక్షణతో వ్యక్తిగత క్రమశిక్షణతోపాటు నాయకత్వ లక్షణాలు, అంకిత భావం, సామాజిక బాధ్యత పెంపొందుతాయన్నారు. అనంతరం ఫైరింగ్, వ్యాసరచనం, చిత్రలేఖనం పోటీల్లో గెలుపొందిన వారికి బహుమతి ప్రదానం చేశారు. కార్యక్రమంలో లెఫ్టినెంట్ కల్నల్ శశిధర్ రావు, సుబేదార్ మేజర్ ఎల్.మాధవరావు, పణీంద్ర, భద్రయ్య, స్వరూపరెడ్డి, సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

నూతన ఉపాధ్యాయులు ఆర్డర్ కాపీలు

సమర్పించాలి : డీఈవో

నల్లగొండ, అక్టోబరు 10: డీఎస్సీ-2024లో ఉపాధ్యాయులుగా ఎంపికై హైదరాబాద్‌లోని ఎల్బీ స్టేడియంలో ఈ నెల 9న తీసుకున్న అపాయింట్‌మెంట్ ఆర్డర్ కాపీ నకలు ప్రతిని జిల్లా విద్యాశాఖ కార్యాలయంలో అందజేయాలని డీఈవో భిక్షపతి గురువారం ఒక ప్రకటనలో కోరారు. గురువారం డీఈవో కార్యాలయంలో ఏర్పాటు చేసిన కౌంటర్‌లో ఉదయం 10గంటల నుంచి సాయంత్రం 5గంటల వరకు పలువురు నూతన ఉపాధ్యాయులు ఆర్డర్ కాపీల నకలు ప్రతులను సమర్పించారని ఆయన తెలిపారు. అదేవిధంగా 11వ తేదీన కూడా డీఈవో కార్యాలయంలో ప్రత్యేక కౌంటర్లు పనిచేస్తాయని, నూతన ఉపాధ్యాయలు ఆర్డర్ కాపీలను తప్పనిసరిగా సమర్పించాలని డీఈవో కోరారు.

ఆర్‌ఆర్‌ఆర్ అలైన్‌మెంట్ మార్చాలి

చౌటుప్పల్ టౌన్, అక్టోబరు 10: యాదాద్రిభువనగిరి జిల్లా చౌటుప్పల్ ప్రాంతం నుంచి వెలుతున్న త్రిపుల్ ఆర్ అలైన్‌మెంట్‌ను మార్చాలని భూ నిర్వాసితులు కోరారు. మల్కాజిగిరి ఎంపీ ఈటల రాజేందర్ ఆధ్వర్యంలో వారు గురువారం హైదరాబాద్‌లో ఎన్‌హెచ్‌ఏఐ రీజినల్ అధికారి పి. శివశంకర్‌కు వినతిపత్రం అందజేశారు. ప్రభుత్వ తమకు న్యాయం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో పీఏసీఎస్ చైర్మన్ చింతల దామోదర్‌రెడ్డి, మాజీ జడ్పీటీసీ పెద్దిటి బుచ్చిరెడ్డి పాల్గొన్నారు. మునుగోడు ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి కూడా భూ నిర్వాసితులు వినతిపత్రం అందజేశారు.

పూర్ణగిరి ఆలయంలో హుండీ ధ్వంసం

భువనగిరి రూరల్, అక్టోబరు 10: యాదాద్రిభువనగిరి జిల్లా భువనగిరి మండలంలోని నమాత్‌పల్లి పూర్ణగిరి లక్ష్మీనర్సింహస్వామి ఆలయంలోని హుండిని ధ్వంసం చేసి దాదాపు రూ.40వేల నగదును గుర్తుతెలియని వ్యక్తులు అపహరించుకుపోయారు. ఆలయ అటెండరు బత్తిని వెంకటేశ్ గురువారం తెల్లవారుజామున ఆలయాన్ని తెరిచేందుకు ప్రయత్నించగా అప్పటికే ఆలయ ప్రధాన ద్వారం తెరిచి ఉంది. లోనికి వెళ్లి చూడగా హుండీ ధ్వంసమై ఉండడంతో ఈ విషయమై ఆలయ ప్రధాన అర్చకుడు పవన్‌కుమార్‌శర్మకు సమాచారం ఇచ్చారు. ఆయన పోలీసులకు సమాచారం ఇచ్చారు. హుండీలో రూ.40వేల నగదు అపహరణకు గురైనట్లు పేర్కొన్నారు. ఈమేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

జూదరుల అరెస్టు

భువనగిరి రూరల్, అక్టోబరు 10: పేకాట ఆడుతున్న ఆరుగురిని అదుపులోకి తీసుకున్నట్లు భువనగిరి రూరల్ ఎస్‌ఐ సంతోష్‌కుమార్ తెలిపారు. భువనగిరి పట్టణ శివారులో పేకాట ఆడుతున్న భువనగిరికి చెందిన ఆరుగురిని అదుపులోకి తీసుకుని, వారి వద్ద రూ.23,610ల నగదు, ఐదు సెల్‌ఫోన్లను స్వాధీనం చేసుకున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.



తాగునీటి ఎద్దడికి చెక్

● అమృత్-2.0లో రూ.461కోట్లు మంజూరు ● ఉమ్మడి జిల్లాలో 17మునిసిపాలిటీలకు నిధులు ● 30ఏళ్ల జనాభా అంచనాతో పనులు



మిర్యాలగూడలోని మునిసిపల్ కార్యాలయం

మిర్యాలగూడ, అక్టోబరు 10: పరిపాలనా సౌలభ్యం కోసం తెలంగాణ ప్రభుత్వం 2018లో నూతనంగా మునిసిపాలిటీలుగా ఏర్పాటు చేసింది. ఉమ్మడి నల్లగొండ జిల్లాలోని 12 మేజర్ గ్రామపంచాయతీలకు మునిసిపాలిటీ హోదా కల్పించారు. గతంలో ఉన్న జిల్లాలోని ఏడు మునిసిపాలిటీలను కలుపుకుని మొత్తం 19మునిసిపాలిటీల్లో 17మున్సిపాలిటీల్లో మంచి నీటి ఎద్దడిని నివారించేందుకు అమృత్-2.0లో రూ.461 కోట్లు నిధులు మంజూరు చేశారు. ప్రజారోగ్యశాఖ ఆధ్వర్యంలో వార్డుల్లో తాగునీటి సరఫరా అవసరమైన పైపులైన్లు, ఓవర్‌హెడ్ ట్యాంకుల నిర్మాణంతో పాటు ఇంటింటికీ నల్లాలు అమర్చే పనులు చేపట్టనున్నారు.

నీటి కొరత, జనాభా ఆధారంగా

మునిసిపాలిటీల్లో పెరుగుతున్న జనాభాను, నీటి కొరతను దృష్టిలో ఉంచుకుని నీటి సరఫరాకు అవసరమైన నిర్మాణపనులను చేపట్టినట్లు సంబంధిత అధికార వర్గాల ద్వారా తెలుస్తోంది. ప్రతి మనిషికీ ప్రతిరోజూ 135 లీటర్ల నీటిని అందించాలన్న జాతీయ విధానంతో మున్సిపాలిటీలలో నీటి సరఫరాకు అమృత్-2 కింద చర్యలు చేపడుతున్నారు. ప్రస్తుతం మునిసిపాలిటీల్లో ఉన్న జనాభా బట్టి ఏటా 2.5శాతం పెరుగుదల అంచనాతో మరో 30 ఏళ్ల వరకు పట్టణ ప్రజలకు నీటి కొరత లేకుండా రక్షిత మంచినీరు సరఫరా చేసే లక్ష్యంతో తయారు చేసిన ప్రతిపాదనలు అమలు చేసే దిశగా ముందుకు సాగుతున్నట్లు అధికారులు అభిప్రాయపడుతున్నారు. మిర్యాలగూడ మునిసిపాలిటీలో ప్రస్తుతం లక్షా 37 వేల జనాభాగా అంచనా వేసి మరో 30 ఏళ్లలో 2లక్షల 50 వేల వరకు జనాభా పెరుగుతుందనే అంచనాతో పెద్దదేవులపల్లి రిజర్వాయర్ వద్ద గతంలో ఉన్న 10ఎంఎల్‌డీ ట్యాంకుకు తోడు నూతనంగా 20ఎంఎల్‌డీ సామర్థ్యం కలిగిన సంప్‌హౌస్ నిర్మాణం, వాటర్ ట్యాంకు తండా వద్ద ఫిల్టర్‌బెడ్ ఏర్పాటుతో పాటు పైపులైన్‌ల నిర్మాణ ప్రక్రియ చేపడుతున్నట్లు తెలుస్తోంది.

అంచనాకు అనుగుణంగా ఏర్పాట్లు



జాతీయ కొలమానం ప్రకారం ప్రతి ఏటా మునిసిపాలిటీలో పెరుగుతున్న జనాభా శాతాన్ని గణనలోకి తీసుకుని 30ఏళ్ల వరకు నీటి సరఫరాకు సబంధించిన పనులను రెండేళ్లలో పూర్తవుతాయి. మిషన్ భగీరథ అధికారులు తాగు నీటి సరఫరా కొనసాగిస్తారు. ఐదేళ్ల వరకు పబ్లిక్‌హెల్త్ ఆధ్వర్యంలో నిర్వహణ కొనసాగుతుంది.

కె. వెంకటేశ్వర్లు, ఎస్‌ఈ, పబ్లిక్‌హెల్త్.

ఏ మునిసిపాలిటీకి ఎన్ని నిధులు

మిర్యాలగూడకు రూ.93.40 కోట్లు, నల్లగొండకు రూ.56.75 కోట్లు, చిట్యాలకు రూ.12.50 కోట్లు, నకిరేకల్‌కు రూ.25 కోట్లు, హాలియాకు రూ.15.20 కోట్లు, నందికొండకు రూ.44 కోట్లు, చండూరుకు రూ.9.20 కోట్లు, సూర్యాపేటకు రూ.45కోట్లు, కోదాడకు రూ.25.80 కోట్లు, నేరేడుచర్లకు రూ.11కోట్లు, తిరుమలగిరికి రూ.30 కోట్లు, చౌటుప్పల్‌కు రూ.21కోట్లు, మోత్కూరుకు రూ.12కోట్లు, భువనగిరికి రూ.21.80 కోట్లు, యాదగిరిగుట్టకు రూ.38.64 కోట్లు, ఆలేరుకు రూ.12 కోట్లు, పోచంపల్లి మునిసిపాలిటీకి రూ.17.50 కోట్ల నిధులు మంజూరయ్యాయి. మొత్తంగా రూ.461 కోట్లు మంజూరైన అమృత్-2 నిధులతో 17 మున్సిపాలిటీల్లో 74ఓవర్‌హెడ్ ట్యాంకులు, సుమారు 673కిలో మీటర్ల గ్రావిటీ పైపులైన్‌ల ద్వారా 41,883 ఇళ్లకు నల్లాల బిగించనున్నారు. గత జూలై చివరి వారం నుంచి పనులు ప్రారంభించగా 24నెలల్లో పనులు పూర్తి చేసేలా కేఎస్‌ఆర్ కన్‌స్ట్రక్షన్ ఒప్పందం కుదుర్చుకున్నట్లు తెలుస్తోంది. హుజూర్‌నగర్, దేవరకొండ మునిసిపాలిటీల్లో గతంలో ఆర్‌డబ్ల్యూఎస్ శాఖ ఆధ్వర్యంలో మంచినీటి సరఫరాకు ఏర్పాట్లు చేసినందున అమృత్-2.0లో ఈ రెండు మునిసిపాలిటీలను మినహాయించినట్లు తెలుస్తోంది.

సమీప గ్రామాల విలీనంతో..

మున్సిపాలిటీల విస్తరణతో వార్డుల సంఖ్య పెరుగుతూ వస్తోంది. పరిసర గ్రామాలను మునిసిపాలిటీల్లో విలీనం చేయడం ద్వారా పట్టణ జనాభా మరింతగా పెరుగుతూ వస్తోంది. జనాభాకు అనుగుణంగా సౌకర్యాల కల్పన కొరవడడంతో మునిసిపాలిటీ పరిధిలోని శివారు వార్డుల్లో అభివృద్ధి కుంటుపడు తోందన్న విమర్శలు విన్పిస్తున్నాయి. మిర్యాలగూడ మండలంలోని నందిపాడు గ్రామపం చాయతీ పరిధిలోని గ్రామాలు, వెంకటాద్రిపాలెం, హైదలాపురం పరిధిలోని ఇందిరమ్మ కాలనీతో కలుపుకుని మిర్యాలగూడ మునిసిపాలిటీని 28కిలో మీటర్ల మేర విస్తరించారు. 2011 జనాభా లెక్కల ప్రకారం మిర్యాలగూడ పట్టణ జనాభా 1,09,891 మంది కాగా, విలీన గ్రామాలతో పాటు పెరిగిన జనాభా కలుపుకుని ప్రస్తుతం లక్షా 37వేల వరకు ఉంటుందని అంచనా వేస్తున్నారు. అప్పుడు 36వార్డులు ఉండగా వాటిని 48 వార్డులుగా పునర్విభజించారు. థర్డ్ గ్రేడ్ మునిసిపాలిటీగా 1941లో ఏర్పాటైన నల్లగొండ మునిసి పాలిటీ ప్రస్తుతం ప్రథమ శ్రేణికి చేరుకుంది. 32 కిలో మీటర్లు విస్తరించిన మునిసిపాలిటీలో 2011 లెక్కల ప్రకారం 1,65,328 మంది జనాభా ఉంది. ప్రస్తుతం 2 లక్షలకు పైగా జనాభా ఉన్నట్లు అంచనా వేస్తున్నారు. మునిసిపాలిటీల్లో పెరుగుతున్న జనాభా, నీటి కొరతను దృష్టిలో ఉంచుకుని నీటి సరఫరాకు అవసరమైన నిర్మాణ పనులను చేపట్టినట్లు సంబంధిత అధికార వర్గాల ద్వారా తెలుస్తోంది. మునిసిపాలిటీల్లో ప్రజలకు మంచినీటి కొరత లేకుండా చూడాలన్న లక్ష్యంతో కేంద్ర ప్రభుత్వం అమృత్ 2.0 కింద నిధులు మంజూరు చేసింది.

పిడుగుపాటుతో మహిళా కూలీ మృతి

● మరో ముగ్గురికి గాయాలు

అడవిదేవులపల్లి, అక్టోబరు 10: పిడుగుపాటుకు గురై ఓ మహిళా కూలీ మృతిచెందింది. ఈ సంఘటన నల్లగొండ జిల్లా అడవిదేవులపల్లి మండల కేంద్రంలో గురువారం జరిగింది. ఎస్‌ఐ శేఖర్ తెలిపిన వివరాల ప్రకారం.. దామరచర్ల మండలంలోని వీర్లపాలెం గ్రామానికి చెందిన పాతులోతు హనిమి(45), మరో ఐదుగురు కూలీలతో కలిసి అదే గ్రామానికి చెందిన సమీప బంధువు మిర్చి తోటలో కలుపు తీసేందుకు వెళ్లారు. సాయంత్రం ఐదు గంటల ప్రాంతంలో వర్షం కురుస్తుండడంతో హనిమి, పొలం యజమాని సక్రియాతో పాటు మిగతా కూలీలు సమీపంలోని ఓ వేప చెట్టు కింద కూర్చున్నారు. ఈ క్రమంలో భారీ శబ్దంతో పిడుగు చెట్టు మీదుగా పాతులోతు హనిమిపై పడడంతో ఆమె అక్కడికక్కడే మృతిచెందింది. ఆమె పక్కన ఉన్న కూలీలు సక్రియా, కళావతి, గూగ, స్పృహ తప్పారు. మిగిలినవారు కేకలు వేయడంతో వెంటనే సమీప పొలాల్లోని రైతులు అక్కడికి చేరుకున్నారు. గాయపడిన ఇద్దరిని మిర్యాలగూడ ఏరియా ఆస్పత్రికి తరలించారు. మృతురాలు హనిమికి ఇద్దరు కుమారులు, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం మిర్యాలగూడ ఏరియా ఆసుపత్రికి తరలించి మృతురాలి పెద్ద కుమారుడు కృష్ణ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.



హనిమి మృతదేహం

పట్నం వదిలి.. పల్లెబాట

● జాతీయ రహదారిపై వాహనాల రద్దీ

చౌటుప్పల్ రూరల్, చౌటుప్పల్ టౌన్, అక్టోబరు 10: సద్దుల బతుకమ్మ దసరా పండుగ నేపథ్యంలో ప్రజలు గురువారం పట్టణం నుంచి పల్లెబాట పట్టారు. హైదరాబాద్ నుంచి ప్రజలు స్వగ్రామాలకు బయలుదేరారు. కుటుంబ సభ్యులతో కలిసి ప్రజలు వివిధ వాహనాలలో సొంత గ్రామాలకు చేరుకుంటున్నారు. విజయదశమి పండుగకు ప్రజలు స్వగ్రామాలకు బయలుదేరి వెళుతుండటంతో హైదరాబాద్ విజయవాడ జాతీయ రహదారి సందడిగా మారింది. వందలాది వాహనాలు జాతీయరహదారి గుండా బారులుతీరి వెళ్లాయి. ఉదయం నుంచి రాత్రి వరకు రహదారిపై వాహనాల రద్దీ నెలకొంది. బస్సులు, కార్లు, ద్విచక్రవాహనాలు, ఆటోల్లో ప్రజలు సొంత గ్రామాలకు పయనమయ్యారు. వాహనాలతో హోటళ్ళు, దాబాలు కిటకిటలాడాయి. యాదాద్రి భువనగిరి జిల్లా చౌటుప్పల్ మండలం పంతంగి టోల్‌గేటు వద్ద దసరా వాహనాల రద్దీ నెలకొంది. టోల్‌గేటు వద్ద వాహనాలు బారులు తీరి వెళ్లాయి. 16గేట్లకు గాను 10 గేట్లకు ద్వారా వాహనాలను విజయవాడ వైపు పంపించారు. సాధారణ రోజుల్లో 35 వేలకు పైగా రాకపోకలు సాగిస్తుండంగా దసరా నేపథ్యంలో గురువారం 10 వేలకు పైగా వాహనాలు రాకపోకలు సాగించిన్నట్టు నిర్వహకులు తెలిపారు. ఫాస్టాగ్‌లతో టోల్‌గేటు వద్ద వాహనాలు సాఫీగా వెళ్ళిపోయాయి. ట్రాఫిక్‌జామ్ కాకుండ టోల్‌గేటు నిర్వహకులు నియంత్రణ చర్యలు చేపట్టారు. టోల్‌గేటు నిర్వహకులు, ట్రాఫిక్ పోలీసులు జాతయరహదారిపై పెట్రోలింగ్ నిర్వహించి ట్రాఫిక్ జామ్‌కాకుండా చూశారు.



చౌటుప్పల్‌లో హైదరాబాద్‌విజయవాడ జాతీయరహదారిపై బారులు తీరిన వాహనాలు

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి





ధ్వంసమైన కారు, సైదులు (ఫైల్)

వేములపల్లి, అక్టోబరు 10: ఆటోను కారు ఢీకొట్టడంతో వ్యక్తి మృతిచెందాడు. ఈ సంఘటన నల్లగొండ జిల్లా వేములపల్లి మండలం శెట్టిపాలెం గ్రామ శివారులోని నార్కట్‌పల్లి- అద్దంకి రహదారిపై గురువారం రాత్రి జరిగింది. స్థానికులు, కుటుంబసభ్యులు తెలిపిన వివరాల ప్రకారం... మండలంలోని శెట్టిపాలెం గ్రామానికి చెందిన సారంగి సైదులు (40) పాత ఇనుము వ్యాపారం చేసుకుం టూ జీవనం కొనసాగిస్తున్నాడు. సైదులు పనులు ముగించుకొని తన ఆటోలో మిర్యాలగూడకు వెళ్లి తిరిగి గురువారం రాత్రి ఇంటికి బయలుదేరాడు. ఈ క్రమంలో శెట్టిపాలెం గ్రామ శివారులోని అన్నపరెడ్డిగూడెం క్రాస్‌రోడ్డు వద్ద రోడ్డు దాటి శెట్టిపాలెం వెళ్తున్న క్రమంలో మిర్యాలగూడకు చెందిన కిరణ్ తన డ్రైవర్ రాఘవేంద్రతో కలిసి కారులో నల్లగొండ నుంచి మిర్యాలగూడ వైపు వెళ్తున్న క్రమంలో అతివేగంగా వెనుక వైపు నుంచి వచ్చి బలంగా ఆటోను ఢీకొంది. ఈ సంఘటనలో ఆటోలో వెళ్తున్న సైదులు ఎగిరి రోడ్డుపై పడి తీవ్రంగా గాయపడ్డాడు. కారు అదుపుతప్పి డివైడర్ దాటి రోడ్డు అవతలి వైపు వెళ్లి మరో కంటైనర్ వాహనాన్ని ఢీకొట్టింది. ఈ సంఘటనలో తీవ్రంగా గాయపడిన సైదులును స్థానికులు 108 వాహనంలో మిర్యాలగూడలోని ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. అక్కడ సైదులును పరీక్షించిన వైద్యులు అప్పటికే మృతిచెందినట్లు నిర్ధారించారు. మృతదేహాన్ని ప్రభుత్వ ఆసుపత్రి మార్చురీలో భద్రపరచారు. సైదులుకు భార్య సైదమ్మ, కుమారుడు, కూతురు ఉన్నారు. కారులో ప్రయాణిస్తున్న కిరణ్, రాఘవేంద్రలు స్వల్ప గాయాలతో బయటపడ్డారు. ఈ సంఘటనపై తమకు ఎలాంటి ఫిర్యాదు అందలేదని పోలీసులు తెలిపారు.

యాదగిరీశుడికి శాస్త్రోక్తంగా నిత్య పూజలు

భువనగిరి అర్బన్, అక్టోబరు 10: స్వామివారి దివ్యక్షేత్రంలో గురువారం నిత్య కైంకర్యాలు పాంచారాత్రగమశాస్త్ర రీతిలో అత్యంత వైభవంగా నిర్వహించారు. ప్రధానాలయ నైరుతి దిశలో అష్టభుజి ప్రాకార మండపంలో ఉత్సవ మూర్తులను పట్టువస్త్రాలు, ముత్యాలు, బంగారు, వజ్రవైఢూర్యాలతో దివ్యమనోహరంగా అలంకరించి ఆచార్యులు గజవాహన సేవలో తీర్చిదిద్ది వేదమంత్ర పఠనాలు, మంగళవాయిద్యాల నడుమ సేవోత్సవం చేపట్టారు. ఉత్సవ మూర్తులను కల్యాణమండపంలో అధిష్ఠింపజేసి, విశ్వక్సేనుడి తొలిపూజలతో కల్యాణతంతు కొనసాగింది. కల్యాణోత్సవంలో పాల్గొన్న భక్తులను అర్చకులు స్వామివారి శేషవస్త్రాలు అందజేసి ఆశీర్వచనం చేశారు. ముందుగా సుదర్శన శతక పఠనంతో హోమం పూజలు నిర్వహించారు. ప్రభాతవేళ గర్భాల యంలో స్వామిఅమ్మవారిని సుప్రభాత సేవతో మేల్కొలిపి అర్చకస్వాములు నిజాభిషేకం, నిత్యార్చనలు చేపట్టారు. పాతగుట్ట ఆలయంలో నిత్య పూజలు సాం ప్రదాయ రీతిలో జరిగాయి. శివాలయంలో శ్రీపర్వతవర్ధిని రామలింగేశ్వరస్వామికి నిత్య పూజలు, యాగశాలలో నిత్య రుద్రహవనం శైవాగమ పద్ధతిలో నిర్వహించారు. వివిధ విభాగాల ద్వారా ఆలయ ఖజానాకు రూ. 13,40,391ల ఆదాయం సమకూరినట్లు ఆలయ ఈవో ఏ. భాస్కర్‌రావు తెలిపారు. ఆలయంలో శనివారం (రేపు) దసర పర్వదినం పున్కరించుకొని శమిపూజ నిర్వహిస్తారు. తూర్పు రాజగోపురం ఎదురుగా సాయంత్రం 5.30గంటలకు వేద మంత్రాలు, మంగళవాయిద్యాల నడుమ పూజలు చేపట్టనున్నట్లు ఈవో తెలిపారు.

దుర్గాదేవిగా శ్రీ పర్వతవర్ధిని

యాదగిరిగుట్ట లక్ష్మీనరసింహస్వామి ఆలయంలో అనుబంధ ఆలయం శివాలయం పర్వతవర్ధిని అమ్మవారి ఆలయంలో దేవి శరన్నవరాత్రోత్సవాలు ఎనిమిదో రోజుకు చేరాయి. ఉత్సవాల్లో గురువారం ఆదిపరాశక్తి దుర్గాదేవిగా భక్తులకు దర్శనమిచ్చారు. ఈ అవతారంలో దుర్గముడు అనే రాక్షసుడిని సంహరించినట్లు, మహా రూపాల్లో తొలిరూపం దుర్గాదేవి రూపమని, బవబంధాల్లో చిక్కుకున్న మానవుడిని అనుగ్రహించి మోక్షాన్ని ప్రసాదించే అమ్మవారిగా భక్తులు దుర్గాదేవి కొలుస్తారని ప్రధానార్చకుడు నరసింహమూర్తి ప్రవచించారు. ఎంతో విశిష్టత గల అమ్మవారికి ఉదయం ప్రాతఃకాల పూజలు, అర్చనలు, పారాయణాలు, గాయత్రి జపాలు, లలిత సహస్రనామార్చన, దుర్గాష్టమి పురస్కరించుకొని పూజారులు విశేషంగా చండీ హవనం నిర్వహించారు. మధ్యాహ్నం పూజ నీరాజన మంత్ర పుష్పాలు అర్పించిన అనంతరం సాయంత్రం శ్రీదేవి నవావరణ పూజ, సహస్రనామార్చన నీరాజనం, మంత్ర పుష్పాలు, దుర్గాదేవి స్వరూప సుమాసినీ పూజల తర్వాత అర్చకులు తీర్థ ప్రసాద వితరణ చేశారు.



పూజలు నిర్వహిస్తున్న అర్చకులు

నిత్యపూజా కైంకర్యాలు

ఉదయం 3.30 గంటలకు ఆలయాన్ని తెరుస్తారు
సుప్రభాతసేవ: ఉదయం 3.30నుంచి4.30వరకు
ఆరాధన: 4-4.30 వరకు, **బాలభోగం:** 4.30-5.15వరకు
నిజాభిషేకం: 5.15 నుంచి 6.15 గంటల వరకు
సహస్రనామార్చనలు: 6.15నుంచి 7గంటల వరకు
రాజభోగం: 12.00నుంచి ఒంటి గంట వరకు,
మధ్యాహ్నం 1-4 వరకు సర్వ దర్శనాలు.
తిరువారాధన: సాయంత్రం 7నుంచి7.0గంటల వరకు
సహస్రనామార్చన: రాత్రి 7.30నుంచి 8.15గంటల వరకు
రాత్రి నివేదన: రాత్రి 9:30 గంటల నుంచి 9:45 వరకు
శయనోత్సవ దర్శనం: 9.30- 9.45 ద్వార బంధనం
ఉచిత దర్శనం: ఉదయం 7 నుంచి 9 గంటల వరకు
తిరిగి సాయంత్రం 5-7 రాత్రి 8.15-9 గంటల వరకు
వీఐపీ వేళలు: ఉదయం 9-10, సాయంత్రం 4-5వరకు..

భువనగిరి అర్బన్

చికెన్ ధరలు

జిల్లా	లైవ్	డ్రెస్	స్కిన్‌లెస్
యాదాద్రి	రూ.148	220	250
సూర్యాపేట	రూ.135	200	230
నల్లగొండ	రూ.134	200	224

సాగర్ సమాచారం

పూర్తిస్థాయి నీటి మట్టం	590.00 అడుగులు
టీఎంసీలు	312.0450
ప్రస్తుత నీటి మట్టం	589.10 అడుగులు
టీఎంసీలు	309.3558
ఎడమకాల్వకు నీటి విడుదల	9,076
కుడికాల్వకు	10,350
విద్యుత్ కేంద్రం ద్వారా	28,948
సాగర్‌కు నీటి రాక	69,035
ఎస్ఎల్‌బీసీ ద్వారా	2,400 క్యూసెక్కులు
అవుట్‌ఫ్లో	57,574 క్యూసెక్కులు

- నాగార్జునసాగర్

పులిచింతల ప్రాజెక్టు

పూర్తిస్థాయి నీటి నిల్వ	45.77 టీఎంసీలు
ప్రస్తుత నీటి నిల్వ	45.46 టీఎంసీలు
పులిచింతలకు నీటి రాక	33,461
నీటి విడుదల	36,938

- మేళ్లచెర్వు

మూసీ నీటిమట్టం


పూర్తిస్థాయి నీటి మట్టం	645 అడుగులు
టీఎంసీలు	4.46
ప్రస్తుత నీటి మట్టం	644.50 అడుగులు
టీఎంసీలు	4.33
ఇన్‌ఫ్లో	1408.96 క్యూసెక్కులు
ఔట్‌ఫ్లో	1408.96 క్యూసెక్కులు

- కేతేపల్లి

రైస్‌మిల్లులో నూకలు, రేషన్ బియ్యం స్వాధీనం

ఆత్మకూర్(ఎస్), అక్టోబరు 10: సూర్యాపేట జిల్లా ఆత్మకూర్(ఎస్) మండల పరిధిలోని పాతర్లపహాడ్ క్రాస్ రోడ్ సమీపంలో గల శ్రీలక్ష్మీమోడ్రన్ రైస్‌మిల్‌లో స్థానికుల సమాచారంతో పోలీసులు గురువారం తనిఖీలు నిర్వహించారు. పెద్ద మొత్తంలో నూకలు, బియ్యం, కుప్పగా పోసిఉండడంతో పీడీఎస్ అని అనుమానంతో వెంటనే సూర్యాపేట సివిల్ సప్లయ్ డీటీ నాగలక్ష్మీకి సమాచారం ఇవ్వగా, డీటీ, సిబ్బంది వచ్చి పరిశీలించినట్లు పోలీసులు తెలిపారు. సుమారు 100 క్వింటాళ్ల నూకలు, క్వింటా రేషన్ బియ్యం స్వాధీనం చేసుకొని పంచనామా చేసి టెక్నికల్ అసిస్టెంట్‌తో శాంపిల్ తీయించారు. నూకలు, బియ్యాన్ని సివిల్‌సప్లయి గోడౌన్‌కు తరలించారు. పీడీఎస్ బియ్యం, నూకలు నిల్వ ఉంచినందుకు మిల్లు యజమాని కాసం రమేష్‌పై ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ సైదులు తెలిపారు.

గుర్తుతెలియని వృద్ధురాలు మృతి



మిర్యాలగూడ అర్బన్, అక్టోబరు 10: ఆర్టీసీ బస్టాండ్ పరిసరాల్లో భిక్షాటన చేస్తూ అస్వస్థతకు గురై ఏరియా ఆస్పత్రిలో చికిత్సపొందతూ గుర్తుతెలియని వృద్ధురాలు(65) గురువారం మృతిచెందింది. టూటౌన్ పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం... సెప్టెంబరు 27వ తేదీన తీవ్ర అస్వస్థతకు గురైన వృద్ధురాలిని చికిత్స నిమిత్తం 108 అంబులెన్స్‌లో ఏరియా ఆస్పత్రికి తరలించినట్లు పోలీసులు తెలిపారు. మృతదేహాన్ని ఆస్పత్రి మార్చురీలో భద్రపరిచినట్లు సీఐ నాగార్జున తెలిపారు. మృద్ధురాలిని గుర్తించిన వారు సెల్: 8712670150, 9966498185 నెంబర్లకు ఫోన్‌చేసి సమాచారం ఇవ్వాలని సీఐ కోరారు.

50 పశువులు పట్టివేత

తిప్పర్తి, అక్టోబరు 10: ఒడిషా రాష్ట్రం నుంచి అక్రమంగా గోవదకు తరలిస్తున్న 50 పశువులను నల్లగొండ జిల్లా తిప్పర్తి పోలీసులు బుధవారం రాత్రి పట్టుకున్నారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. ఒడిషా రాష్టం నుంచి టీఎస్ 07 యూకే 9701 నెంబరు గల డీసీఎంలో బుధవారం రాత్రి హైదరాబాద్‌కు తరలిస్తుండగా తిప్పర్తి మండల కేంద్రంలో వాహన తనిఖీలు చేస్తున్న పోలీసులకు పట్టుబడ్డాయి. ఆ వాహనంతో పాటు పశువులను పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. సఫావత్ రాజేందర్, డ్రైవర్ మద్దూరి శ్రీశైలం, కూలీలు చిప్పాడ అప్పారావు, శేరం శ్రీనుపై కేసు నమోదు చేశారు. పశువులను మాడ్గులపల్లి మండల పరిధిలోని దాచారం గోశాలకు తరలించినట్లు ఎస్‌ఐ బి. సాయి ప్రశాంత్ తెలిపారు.

గుర్తుతెలియని వ్యక్తి మృతదేహం లభ్యం

మాడ్గులపల్లి, అక్టోబరు 10: నల్లగొండ జిల్లా మాడ్గులపల్లి మండలం కుక్కడం గ్రామ శివారులో ఉన్న రైల్వే ట్రాక్‌పై గుర్తుతెలియని వ్యక్తి మృతదేహం లభ్యమైంది. గురువారం మధ్యాహ్నం 105/7ఏ 8 పట్టాల మధ్య గుర్తుతెలియని మృతదేహం పడి ఉండడాన్ని గమనించిన సిబ్బంది గమనించి స్టేషన్ మాస్టర్ అభినవ్ కుమార్‌కు సమాచారం అందించడంతో ఆయన రైల్వే పోలీసులకు సమాచారం అందించారు. దీంతో అక్కడికి చేరుకున్న రైల్వే అధికారులు మృతదేహాన్ని పరిశీలించారు. మృతుడి సుమారు 40 సంవత్సరాలు ఉంటాయని గతంలో చేతి మీద కోసుకున్న గుర్తులు ఉన్నాయని, ముఖం గుర్తు పట్టకుండా ఛిద్రమైందని పోలీసులు తెలిపారు. మృతదేహంపై నల్ల కలర్ టీషర్ట్, బూడిద రంగు ప్యాంటు ఉందని సదరు వ్యక్తి రైలు కింద పడి మృతిచెందాడని పోలీసులు భావిస్తున్నారు. కేసు నమోదు చేసుకున్న పోలీసులు దర్యాప్తు చేస్తున్నట్లు, మృతదేహాన్ని నల్లగొండ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించినట్లు రైల్వే హెడ్ కానిస్టేబుల్ రజిత తెలిపారు.

ఘనంగా సద్దుల బతుకమ్మ

జిల్లాలో మహిళలు గురువారం సద్దుల బతుకమ్మ వేడుకను సంప్రదాయబద్ధంగా నిర్వహించారు. వ్యవసాయ భూముల్లో సేకరించిన వివిధ రకాల రంగురంగుల పూలతో పోటీలు పడి అందమైన ఆకృతుల్లో పేర్చిన బతుకమ్మలను ఎత్తుకుని ఆయా గ్రామాల్లోని దేవాలయాలు, చెరువుల వద్దకు చేరుకున్నారు. బతుకమ్మలను ఒక్కచోట చేర్చి బతుకమ్మ.. బతుకమ్మ.. ఉయ్యాలో... అంటూ బతుకమ్మ చుట్టూ తిరుగుతూ ఆటలు ఆడి, పాటలు పాడి ఒకరికొకరు పండుగ శుభాకాంక్షలు చెప్పుకున్నారు. అనంతరం స్థానికంగా ఉన్న చెరువులు, కుంటల్లో బతుకమ్మలను నిమజ్జనం చేశారు.


తిప్పర్తిలో బతుకమ్మ ఆడుతున్న మహిళలు


నల్లగొండ: బతుకమ్మ తీసుకువస్తున్న మహిళలు


నార్కట్‌పల్లిలో....


నల్లగొండ జిల్లా కేంద్రంలోని రామాలయం వద్ద బతుకమ్మ ఆడుతున్న మహిళలు


దేవరకొండలో పూజలు చేస్తున్న ఎమ్మెల్యే బాలునాయక్


నల్లగొండ వీటీ కాలనీలో బతుకమ్మ...






బతుకమ్మలతో మహిళలు






నల్లగొండ : విద్యానగర్‌లో పాల్గొన్న కాలనీవాసులు


వేములపల్లి : బతుకమ్మ ఆడుతున్న మహిళలు


నల్లగొండ : రాక్‌హిల్స్ కాలనీలో బతుకమ్మ ఆడుతున్న మహిళలు


వేములపల్లిలో...


కేతేపల్లిలో బతుకమ్మ ఆడుతున్న గ్రామస్థులు

నాయకులు సమన్వయంతో పనిచేయాలి

● ఎమ్మెల్యే మందుల సామేలు


పెర్కకొండారంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే సామేల్

శాలిగౌరారం, అక్టోబరు 10: కాంగ్రెస్ నాయకులు సమన్వయంతో పని చేస్తూ పార్టీని బలోపేతం చేయాలని ఎమ్మెల్యే మందుల సామేలు అన్నారు. మండలంలోని పెర్కకొండారం గ్రామంలో ఇటీవల మృతి చెందిన కాంగ్రెస్ పార్టీ నాయకుడు శానాల యుగేందర్‌రెడ్డి తండ్రి శానాల అప్పారెడ్డి చిత్రపటానికి ఆయన పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. కుటుంబ సభ్యులను ఓదార్చి సంతాపం వ్యక్తం చేశారు. అనంతరం ఆయన విలేకరులతో మాట్లాడారు. రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో కాంగ్రెస్ సత్తా చాటాలన్నారు. శుక్రవారం తిరుమలగిరి ఇంటిగ్రేటెడ్ స్కూల్ శంకుస్థాపనకు కాంగ్రెస్ కార్యకర్తలు అధిక సంఖ్యలో హాజరై విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో పార్టీ మండల అధ్యక్షుడు కందాల సమ రంరెడ్డి, జిల్లా ఉపాధ్యక్షుడు అన్నెబోయిన సుధాకర్, శానాల యుగేందర్‌రెడ్డి, చింత ధనుంజయ్, నాయకులు పలస సైదులు, మంగదుడ్ల శ్రీనివాస్, గన్నపురెడ్డి భిక్షంరెడ్డి, జయరాజు, రంగారెడ్డి, జాన్, కృష్ణ, కిషోర్, వెంకన్న పాల్గొన్నారు.

యువత క్రీడల్లో రాణించాలి

మాడ్గులపల్లి, అక్టోబరు 10: యువత క్రీడల్లో రాణించాలని, దీంతో సమాజంలో మంచి గుర్తింపు సాధించాలని యువజన కాంగ్రెస్ రాష్ట్ర నాయకుడు గడ్డం పురుషోత్తంరెడ్డి అన్నారు. మండలంలోని తోపుచర్లలో గురువారం ఆయన వాలీబాల్ క్రీడా పోటీలను ప్రారంభించి మాట్లాడారు. క్రీడలు గ్రామీణ ప్రాంతాల్లోని యువకుల్లో దాగి ఉన్న ప్రతిభను వెలికితీస్తాయని అన్నారు. అనంతరం క్రీడల్లో గెలుపొందిన క్రీడాకారులకు ఆయన బహుమతులు అందచేశారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ మంగా యాదగిరి, మండల పరిషత్ మాజీ కోఆప్షన్ సభ్యుడు షేక్ మౌలాలి, నాయకులు గౌని నిరంజన్, గడ్డం శ్యామ్‌సుందర్‌రెడ్డి, కట్టా రాఘవరెడ్డి, కట్టా శ్రీనివాస్‌రెడ్డి, రణదీప్‌రెడ్డి, సంకలమద్ది మధుసూదన్‌రెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి, మంగ నాగరాజు, జానయ్య, సతీష్, శంకర్, వెంకన్న, ఎల్లయ్య, రవి, రసూల్, రజాక్, అస్లాం, విష్ణు, నాగేందర్, చింటు, మహేష్ పాల్గొన్నారు.

మాజీ ఎమ్మెల్సీ చెరుపల్లికి మాతృవియోగం


లక్ష్మమ్మ మృతదేహం వద్ద నివాళులర్పిస్తున్న శాసన మండలి చైర్మన్ గుత్తా, ఎమ్మెల్యే వేముల వీరేశం

చిట్యాల, అక్టోబరు 10: మాజీ ఎమ్మెల్సీ సీపీఎం కేంద్ర కమిటీ సభ్యుడు చెరుపల్లి సీతారాములు తల్లి చెరుపల్లి లక్ష్మమ్మ (96) గురువారం వృద్ధాప్యంతో మృతి చెందింది. లక్ష్మమ్మ మృతదేహానికి శాసనమండలి ఛైర్మన్ గుత్తా సుఖేందర్‌రెడ్డి, ఎమ్మెల్యే వేముల వీరేశం, ఉపాధ్యాయ ఎమ్మెల్సీ అలుగుబెల్లి నర్సిరెడ్డి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కుటుంబసభ్యులను పరామర్శించారు.

శ్రీదుర్గాదేవిగా దర్శనమిచ్చిన అమ్మవారు

నల్లగొండ కల్చరల్, అక్టోబరు 10: శ్రీదేవి శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా ఎనిమిదవ రోజైన గురువారం అమ్మవారు దుర్గాదేవిగా భక్తులకు దర్శనం ఇచ్చారు. అర్చకులు పలు మండపాల్లో అమ్మవారిని మారేడుపత్రి, లిల్లిపూలు, ఎరుపుచీరతో అలంకరించి శ్రీదుర్గాదేవిగా పూజలు చేశారు. అనంతరం భక్తులు అమ్మవారిని దర్శించుకొని భక్తితో పూజించి తీర్థప్రసాదాలను స్వీకరించారు. తుంగతుర్తి మాజీ ఎమ్మెల్యే గాదరి కిషోర్ పట్టణంలోని రాక్ హిల్‌కాలనీలోని అమ్మవారి మండపాన్ని కుటుంబసమేతంగా దర్శించి అమ్మవారికి పూజలు చేశారు. అనంతరం భక్తులకు అన్నదాన ప్రసాదం అందజేశారు. ఈ కార్యక్రమంలో మునిసిపల్ మాజీ ఛైర్మన్ మందడి సైదిరెడ్డి, టీఆర్ఎస్ పట్టణ అధ్యక్షుడు బోనగిరి దేవేందర్, కౌన్సిలర్లు, నాయకులు, సభ్యులు పాల్గొన్నారు.


నల్లగొండ పట్టణంలోని రాక్‌హిల్స్ కాలనీలో నిర్వహించిన దుర్గామాత విగ్రహం వద్ద పూజల్లో పాల్గొన్న మాజీ ఎమ్మెల్యే కిషోర్, భక్తులు

అన్ని రకాల వరి ధాన్యానికి బోనస్ ఇవ్వాలి

● సీపీఎం జిల్లా కార్యదర్శి ముదిరెడ్డి సుధాకర్‌రెడ్డి

దామరచర్ల, అక్టోబరు 10: రాష్ట్రంలో రైతులు పండించే అన్ని రకాల వరి ధాన్యానికి ప్రభుత్వం క్వింటాకు రూ.500 బోనస్ అందించాలని సీపీఎం జిల్లా కార్యదర్శి ముదిరెడ్డి సుధాకర్‌రెడ్డి అన్నారు. మండల కేంద్రంలో గురువారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. జిల్లాలో ఐకేపీ కేంద్రాల సంఖ్యను పెంచి రైతులకు అధికార యంత్రాంగం అందుబాటులో ఉండి ధాన్యం కొనుగోలు చేయాలన్నారు. వెంటనే రైతు భరోసా డబ్బులను రైతుల ఖాతాలో జమ చేయాలని అన్నారు. రూ. 2 లక్షల రుణమాఫీ విషయంలో ప్రభుత్వం ఇంతవరకు ఎలాంటి స్పష్టత ఇవ్వకపోవడంపై రైతాంగం అయోమయ పరిస్థితిలో ఉన్నారని అన్నారు. కార్యక్రమంలో సీపీఎం రాష్ట్ర కమిటీ సభ్యుడు డబ్బీకార్ మల్లేష్, మాలోతు వినోద్, పాపానాయక్, కోటిరెడ్డి, దయానంద్, ఎర్రనాయక్, ఖాజా మోహిద్దిన్ తదితరులు పాల్గొన్నారు.


సమావేశంలో మాట్లాడుతున్న ముదిరెడ్డి సుధాకర్‌రెడ్డి

జిల్లాలో పలుచోట్ల కురిసిన వర్షం

మిర్యాలగూడ అర్బన్, అక్టోబరు 10: మిర్యాలగూడ పట్టణంలో గురువారం ఉరుములు, మెరుపులతో కూడిన భారీ వర్షం కురిసింది. సుమారు గంటసేపు కురిసిన వర్షంతో ప్రధాన రహదారులు జలమయమయ్యాయి. సద్దుల బతుకమ్మ తయారీ కోసం విక్రయించేందుకు వ్యాపారులు తెచ్చిన పూలు వర్షానికి తడిసిపోయాయి. దీంతో చిరువ్యాపారులు తీవ్ర అసౌకర్యానికి గురయ్యారు. తమ సరుకులను తడవకుండా కాపాడుకునేందుకు ఉరుకులు పరుగులు తీశారు. పట్టణ శివారుకాలనీలోని నాలాలు పొంగిపొర్లడంతో మురుగునీరు వీధుల్లోకి చేరి ప్రజలు అసౌకర్యానికి లోనయ్యారు.




దేవరకొండలో కురుస్తున్న వర్షం, మిర్యాలగూడ పట్టణంలో పెట్రోల్ బంక్‌లోకి వచ్చిన వర్షపు నీరు

దేవరకొండలో ముసురుతో కూడిన వర్షం

దేవరకొండ: దేవరకొండ డివిజన్‌లో ముసురుతో కూడిన వర్షం కురిసింది. దేవరకొండ, కొండమల్లేపల్లి, చింతపల్లి, నేరేడుగొమ్ము, చందంపేట, డిండి మండలాల్లో ముసురుతో కూడిన వర్షం కురుస్తుండటంతో చేతికి వచ్చిన పత్తి పంట వర్షానికి తడిసిపోతుందని పత్తి రైతులు ఆందోళన చెందుతున్నారు.

మిర్యాలగూడ: వాన వచ్చినప్పుడల్లా వరద నీరు రోడ్లపైకి చేరి పట్టణ ప్రజలకు, వాహనదారులకు ఇక్కట్లు తప్పడం లేదు. మధ్యాహ్నం అరగంట సేపు భారీగా వర్షం కురియడంతో పలు కాలనీల్లో వరద నీరు రోడ్లపై ప్రవహించడంతో ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొన్నారు. దసరాను పురస్కరించుకుని వివిధ షాపింగ్ మాల్స్‌కు వచ్చిన వివిధ గ్రామాల ప్రజలు వర్షంతో ఇబ్బందులు పడ్డారు. పట్టణంలో పలుచోట్ల ట్రాఫిక్ తీవ్ర అంతరాయం కలిగింది.

గోవులను సంరక్షించేందుకు కృషి : ధనుంజయ

చింతపల్లి, అక్టోబరు 10: గోవులను సంరక్షించేందుకు నిరంతరం కృషి చేస్తానని ట్రస్టు ఛైర్మన్ మంచికంటి ధనుంజయ్య అన్నారు. చింతపల్లి మండలకేంద్రంలోని సాయిబాబా దేవాలయంలో గురువారం కుటుంబ సమేతంగా ఆయన సాయిబాబాకు ప్రత్యేక అభిషేకంతో పాటు సహస్ర నామావళి పూజలు భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ హిందూ ధర్మ పరిరక్షణ కోసం సాయిసన్నిధిలో కృషి చేస్తున్నట్లు తెలిపారు. గోశాల ఏర్పాటు చేసి 400 గోవులను సంరక్షించనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో ప్రధాన కార్యదర్శి కొమిరిశెట్టి వెంకటయ్య, కోశాధికారి పూరె కృష్ణయ్య, గోశాల సభ్యుడు కుంభం పల్లారెడ్డి, తడకమళ్ల శ్రీనివాస్, సుదర్శన్ పాల్గొన్నారు.


ఆలయంలో మాట్లాడుతున్న మంచికంటి ధనుంజయ్య

ఘనంగా మాజీ ఎమ్మెల్యే భగత్ జన్మదిన వేడుకలు



హాలియాలో కేక్ కట్ చేస్తున్న మాజీ ఎమ్మెల్యే భగత్

హాలియా, అక్టోబరు 10: నాగార్జునసాగర్ నియోజకవర్గ మాజీ ఎమ్మెల్యే నోముల భగత్ జన్మదిన వేడుకలను గురువారం హాలియాలో భగత్ నివాసంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా నోముల భగత్ భారీ కేక్‌ను కట్ చేసి కార్యకర్తలకు పంపిణీ చేశారు. అనంతరం అభిమానులు రక్తదానం చేశారు. అంతకుముందు భగత్ పూలమొక్కను నాటారు. భగత్ జన్మదినం సందర్భంగా పలువురు శాలువాలతో ఘనంగా సన్మానించారు. అదే విధంగా బీఆర్ఎస్ పార్టీ అధినేత కేసీఆర్‌ను మర్యాదపూర్వకంగా కలిసి ఆశీర్వాదం తీసుకున్నారు. ఈ సందర్భంగా కేసీఆర్‌ను భగత్‌ను శాలువాతో సన్మానించారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు కూరాకుల వెంకటేశ్వర్లు, జవ్వాజి వెంకటేశం, పట్టణ అధ్యక్షుడు వడ్డే సతీష్‌రెడ్డి, పిడిగం నాగయ్య, తాటి సత్యపాల్, రవినాయక్, శ్రీనివాస్‌రెడ్డి, బొల్లం రవి, సురభి రాంబాబు, అంజనేయులు, శ్రీనివాస్‌రెడ్డి, లింగయ్య, సైదాచారి, రామలింగయ్య, సైదులు, జానయ్య, మురళి, రామలింగయ్య, వెంకటయ్య, నాగరాజు, శ్రీనివాస్‌రెడ్డి, వెంకటాచారి తదితరులు పాల్గొన్నారు.

హామీల అమలులో ప్రభుత్వం విఫలం

శాలిగౌరారం, అక్టోబరు 9: ఎన్నికల హామీలను అమలు చేయడంలో కాంగ్రెస్ ప్రభుత్వం విఫలమైందని బీఆర్ఎస్వీ మండల అధ్యక్షుడు మహేశ్వరం వెంకన్న అన్నారు. మండల కేంద్రంలో గురువారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. రియల్ ఎస్టేట్ వ్యాపారం కోసమే రేవంత్‌రెడ్డి మూసీ సుందరీకరణ పనులు అనే అంశాన్ని తెరమీదకు తెచ్చారని విమర్శించారు. మార్పు ట్యాగ్‌లైన్ పెట్టుకొని అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం 10 నెలల కాలంలో కొత్తగా చేసింది ఏమిటో చెప్పాలని ఆయన డిమాండ్ చేశారు. బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలోనే అభివృద్ధి జరిగిందని అన్నారు. మూసీ నిర్వాసితులకు కాంగ్రెస్ ప్రభుత్వం ఇస్తానంటున్న డబుల్ బెడ్‌రూం ఇళ్లు సైతం గత ప్రభుత్వ నిర్మించినవేనని అన్నారు. ప్రజా సమస్యల పరిష్కారం కోసం బీఆర్ఎస్ ప్రజల కోసం ప్రభుత్వంపై పోరాటం చేస్తామని ఆయన అన్నారు.

పత్తి కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేయాలి


తహసీల్దార్‌కు వినతిపత్రం సమర్పిస్తున్న సీపీఐ నాయకులు

చిట్యాల, అక్టోబరు 10: పత్తి కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేయాలని సీపీఐ జిల్లా సహాయ కార్యదర్శి లొడంగి శ్రవణ్‌కుమార్ డిమాండ్ చేశారు. గురువారం పట్టణంలోని సీపీఐ ఆధ్వర్యంలో పత్తి కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేయాలని తహసీల్దార్‌కు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పత్తి కొనుగోలు కేంద్రాలు లేకపోవడం వల్ల రైతులు దళారులకు అమ్మి నష్టపోతున్నారని తెలిపారు. కార్యక్రమంలో మండల కార్యదర్శి ఎండీ అక్బర్, పట్టణ కార్యదర్శి ఎస్‌కే షరీఫ్, దేశగోని బాలరాజు, గుండాల సత్తయ్య, రావుల చినవెంకన్న తదితరులు పాల్గొన్నారు.

సంక్షిప్త సమాచారం...

దేవరకొండ: దేవరకొండ మండలం మర్రిచెట్టుతండాకు చెందిన గిరిజన విద్యార్థి నేనావత్ చందర్ ఎంబీబీఎస్‌లో సీటు సాధించారు. ఈ సందర్భంగా దేవరకొండలో ఎంబీబీఎస్ సీటు సాధించిన చందర్‌ను మాజీ ఎమ్మెల్యే రవీంద్రకుమార్ గురువారం ఆయన నివాసంలో అభినందించారు. గిరిజనులు అన్ని రంగాల్లో రాణించాలని తనవంతుగా సహాయ, సహకారాలు అందిస్తానని అన్నారు.

శాలిగౌరారం: కమ్యూనిస్టు నాయకుడు రావుల యల్మయ్య ఆశయ సాధన కోసం ప్రతి ఒక్కరూ కృషి చేయాలని బీసీ సాంస్కృతిక సేన తెలంగాణ రాష్ట్ర అధ్యక్షుడు దూళిపాల ధనుంజయనాయుడు అన్నారు. శాలిగౌరారంలో బీసీ నాయకుడు రావుల యల్మయ్య సంతాపసభకు ఆయన హాజరై మాట్లాడారు. తన జీవితం మొత్తం ఎర్రజెండాకు అంకితం చేసి బీసీ ఉద్యమంలో ప్రముఖ పాత్ర వహించి పేదల అభివృద్ధి కోసం అహర్నిశలు శ్రమించాడని అన్నారు. కార్యక్రమంలో నాయకులు యల్లబోయిన సింహాద్రి, రావుల సత్యం, రావుల కృష్ణ, గుడిపాటి శ్రీహరి, మల్లేష్ పాల్గొన్నారు.

నార్కట్‌పల్లి: నేతన్నకు చేయూత కార్యక్రమం కింద గత ప్రభుత్వం ప్రవేశపెట్టిన త్రిఫ్ట్ పథకాన్ని కాంగ్రెస్ ప్రభుత్వం కొనసాగించాలని పద్మశాలీ చేనేత యువజన సంఘం మండల అధ్యక్షుడు చెరుపల్లి రఘుపతి కోరారు. చేనేత కార్మికులకు ఎంతో మేలు చేసే ఈ త్రిఫ్ట్ పథకాన్ని తిరిగి కొనసాగించాలని ఆయన కోరారు.

కనగల్: మండలంలోని చర్లగౌరారం గ్రామ స్టేజీ వద్ద ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా నిర్మించ తలపెట్టిన ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూల్ కాంప్లెక్స్ పనులకు శుక్రవారం మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి శంకుస్థాపన చేస్తారని కాంగ్రెస్ సీనియర్ నాయకుడు, మాజీ జడ్పీటీసీ నర్సింగ్ శ్రీనివాస్ గౌడ్ తెలిపారు. కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు అధికసంఖ్యలో హాజరై విజయవంతం చేయాలని ఆయన కోరారు.

పెద్దవూర: సమాచార హక్కు చట్టం-2005 ఆవిర్భావ వేడుకలను మండలకేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా సామాజిక కార్యకర్త తగరం శ్రీను కేక్ కట్ చేసి పంపిణీ చేసి మాట్లాడారు. పరిపాలనలో పారదర్శకత కోసం 2005లో సమాచార హక్కు చట్టం అమలులోకి వచ్చిందని తెలిపారు. చట్టం వచ్చి 19 సంవత్సరాలవుతున్నా ప్రభుత్వ కార్యాలయాల్లో సూచిక బోర్డులు లేవని అన్నారు. సామాన్యుడి వజ్రాయుధమైన సమాచార హక్కు చట్టాన్ని వినియోగించుకోవాలన్నారు. కార్యక్రమంలో కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

చింతపల్లి: సమాజంలోని ప్రతి ఒక్కరూ ఆధ్యాత్మిక చింతన కలిగి ఉండాలని మాల్ మార్కెట్ కమిటీ ఛైర్మన్ దొంతం అలివేలు సంజీవరెడ్డి అన్నారు. మండలంలోని వింజమూరు శివారుల్లో ఏర్పాటు చేసిన దుర్గామాతకు కుటుంబసమేతంగా పూజలు చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ దుర్గామాత అనుగ్రహం ప్రతి ఒక్కరూ పొందాలని ప్రత్యేక పూజలు జరిపారు.

చిట్యాలరూరల్: వ్యాపార పారిశ్రామిక దిగ్గజం, భారతరత్న టాటా సన్స్ మాజీ చైర్మన్ రతన్ నావెల్ టాటా మృతి చెందడంతో చిట్యాల మండలం పెద్దకాపర్తిలో డీసీసీ ఉపాధ్యక్షుడు, మాజీ సర్పంచ్ కందిమళ్ల శిశుపాల్‌రెడ్డి, గ్రామశాఖ అధ్యక్షుడు నీలకంఠం లింగస్వామి నివాళులర్పించారు. రతన్‌టాటా చిత్రపటానికి పూలమాలలు వేసి పుష్పాంజలి ఘటించి నివాళులర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వారసత్వంగా వస్తున్న వ్యాపారాన్ని ప్రపంచస్థాయికి తీసుకెళ్లి టాటా వ్యాపారసంస్థను రూ. 100కోట్ల డాటర్లకు తీసుకెళ్లిన ఘనత రతన్‌టాటాకే చెందినదన్నారు. ఆయన అకాల మృతి తీరనిలోటన్నారు. తమ వ్యాపారలాభాల్లో 60 శాతానికి పైగా దాతృత్వ, సామాజిక కార్యక్రమాలకే ఖర్చు చేశారని కొనియాడారు. కార్యక్రమంలో పొట్లపల్లి రవిగౌడ్, ఓర్సు శ్రీను, పొట్లపల్లి స్వామి, శ్రీశైలం, తిరుమలేష్, సత్తయ్య, వెంకటేష్, మత్స్యగిరి, రవి, శ్రీను పాల్గొన్నారు.

పెద్దవూర: మాజీ ఎమ్మెల్యే నోముల భగత్ జన్మదిన వేడుకలను మండలకేంద్రంలో బీఆర్ఎస్ నాయకులు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా మాజీ ఎమ్మెల్యే నోముల భగత్ కేక్‌కట్ చేసి కార్యకర్తలకు పంపిణీ చేశారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ పార్టీ మండల అధ్యక్షుడు జటావత్ రవినాయక్, నాయకులు రమావత్ శ్రీకర్‌నాయక్, మెండె సైదులు, రమావత్ రవినాయక్, రాజేష్‌నాయక్, శశిధర్‌రెడ్డి, గోపినాయక్ పాల్గొన్నారు.

దుర్గాదేవిగా దర్వేశిపురం ఎల్లమ్మ


ప్రత్యేక అలంకరణలో ఎల్లమ్మ తల్లి

కనగల్, అక్టోబరు 10: దేవి శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా మండలంలోని దర్వేశిపురం స్టేజీ వద్ద గల శ్రీరేణుకా ఎల్లమ్మ ఆలయంలో గురువారం ఎరుపు రంగుచీరలో దుర్గాదేవి అవతారంలో అమ్మవారు భక్తులకు దర్శనమిచ్చారు. అర్చకులు అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించి పులిహోరా నైవేద్యంగా సమర్పించారు. వివిధ ప్రాంతాల నుంచి అధికసంఖ్యలో తరలివచ్చిన భక్తులు అమ్మవారిని దర్శించుకున్నారు. వివిధ గ్రామాల్లో ఏర్పాటు చేసిన దుర్గమ్మ మండపాల్లో ఉత్సవకమిటీల ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. పలు గ్రామాల్లో సద్దుల బతుకమ్మ వేడుకలు ఘనంగా నిర్వహించారు. బతుకమ్మల చుట్టూ మహిళలు చప్పట్లు కొడుతూ సంప్రదాయబద్ధంగా ఆడిపాడారు.

ఉపాధ్యాయుడిగా ఎంపికైన వెంకన్న


దండంపల్లి వెంకన్న

కట్టంగూరు, అక్టోబరు 10: మండలంలోని మల్లారం గ్రామానికి చెందిన దండంపల్లి వెంకన్న ఇటీవల విడుదల చేసిన డీఎస్సీ పోటీ పరీక్షల ఫలితాల్లో స్కూల్ అసిస్టెంట్ కేటగిరీలో సోషల్ సబ్జెక్టులో ఉపాధ్యా య ఉద్యోగం సాధించారు. సోషల్ విభాగంలో జిల్లా స్థాయిలో 13వ ర్యాంకు సాధించాడు. ఈ నెల 9వ తేదీన హైదరాబాద్‌లోని ఎల్బీ స్టేడియంలో అధికారులు నియామక పత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఉద్యోగానికి ఎంపికైన వెంకన్నను నాయకులు, గ్రామస్థులు అభినందించారు.